
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
5
గురువారం 25 జనవరి 2024



ఎప్పటికి పూర్తయ్యేనో..?

- వేంపల్లెలో రోడ్డు, మురుగుకాల్వ నిర్మాణాలు
- కూడలిలో గుంత తవ్వి వదిలేశారు
- పనుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు లేనివైనం
- ఎక్కడపడితే అక్కడ మట్టికుప్పలు.. తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం
- నిత్యం ప్రమాదాలు

వేంపల్లెలో అభివృద్ధి పనులేమో కానీ.. ఇక్కడి ప్రజలు మాత్రం నరకం చూస్తున్నారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ, రోడ్డు నిర్మాణం, మురుగుకాల్వ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో కాంట్రాక్టర్, అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోవడం, నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కడప-పులివెందుల రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలి కానీ ఇలా తమను ఇబ్బందిపెట్టడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పనులు చేయాలని అయితే ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌లదేనని అంటున్నారు.

వేంపల్లె, జనవరి 24: వేంపల్లె పట్టణం హనుమాన్ జంక్షన్ నుంచి నాలుగురోడ్ల కూడలి మీదుగా పులివెందుల రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ పనులు, సిమెంటు రోడ్డు నిర్మాణం, మురుగు కాల్వల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు విడుదల చేసింది. విస్తరణకు సంబంధించి ఇంకా పలుచోట్ల తొలగింపు పనులు చేయాల్సి ఉంది. సిమెంటు రోడ్డు పనులు చేస్తున్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మొన్న వేమనారాయణ, నిన్న ఖాజాపీర్ ఇక్కడ వాహనాల నుంచి కిందపడి గాయపడ్డారు. పనులు జరుగుతున్న చోట ప్రమాద సూచిక బోర్డులు పెట్టకపోవడం వల్ల ఈ ప్రమాదాలు జరిగాయి.

ట్రాఫిక్‌తో సమస్యలు

వేంపల్లెలో రోడ్డు, మురుగుకాల్వ పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తైన చోట కూడా మట్టికుప్పలను తొలగించకుండా అలానే వదిలేశారు. దీంతో వాహనాలు రోడ్డు మధ్యలో వెళ్లాల్సి రావడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మరోవైపు రోడ్లలో మట్టి పేరుకుపోయి ప్రజలు దుమ్ముతో అలల్లాడిపోతున్నారు. కనీసం వారం రోజులకు ఒక్కసారైనా రోడ్డుపైనున్న మట్టిని శుభ్రం చేయించాలని పంచాయతీ, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

రాత్రికి రాత్రే గొయ్యి తవ్వారు

రోడ్డు విస్తరణ, రోడ్ల ఏర్పాటు పనుల్లో భాగంగా వేంపల్లెలో నాలుగురోడ్ల కూడలి అభివృద్ధి పనులు మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో 20రోజుల క్రితం కూడలిలో ఉన్నఫలంగా రాత్రికి రాత్రే గొయ్యి తవ్వారు. కొంత కాంక్రీట్ పనులు చేశారు. కారణం తెలియదు కాని తర్వాత పనులు చేయకుండా వదిలేశారు. దీంతో అటు గండి, పులివెందుల, ఇటు కడప రోడ్డులో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పనులు చేయడంలో ప్రణాళిక లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ ఏఈ వెంకటరమణ దృష్టికి స్థానికులు తీసుకెళ్లినా పరిస్థితుల్లో మార్పులేదు. ఇప్పటికైనా ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



వేంపల్లె నాలుగురోడ్ల కూడలిలో అభివృద్ధి పనుల్లో భాగంగా తీసిన గొయ్యి



వేంపల్లె పట్టణం పులివెందుల మార్గంలోని సిమెంటు రోడ్డులో కనిపించని హెచ్చరిక బోర్డులు



రోడ్డు మధ్యలో మట్టికుప్ప ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు



ఎస్పీని కలిసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న లింగారెడ్డి.. చిత్రంలో వికాస్ హరి, హరిప్రసాద్, తదితరులు

పోలీసుల దెబ్బకు వ్యాపారుల బెంబేలు

- బంగారు అంగళ్ల వద్ద కాపుకాచి తనిఖీలు అన్యాయం
- కొనుగోళ్లకు వచ్చేందుకు భయపడుతున్న ప్రజలు
- ఎస్పీకి వివరించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి
- రూ.10 లక్షల లోపు అయితే డీఎస్పీ విడుదల చేస్తారన్న ఎస్పీ

కడప (క్రైం) జనవరి 24: పోలీసులు కొద్దిరోజులుగా ప్రొద్దుటూరులో బంగారు అంగళ్ల వద్దనే కాపుకాచి వ్యాపారులకు వచ్చే వారి వద్ద నగదు పట్టుకుంటున్నారని, దీంతో వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరితో కలసి బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌ను కలిశారు. ప్రొద్దుటూరులో పోలీసుల తనిఖీలపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయం వెలుపల వారు మీడియాతో మాట్లాడారు.

ప్రొద్దుటూరు బంగారు వ్యాపారానికి ప్రసిద్ధి అని, దీనికి రెండో ముంబైగా పేరుందని అన్నారు. పోలీసు అధికారులు బంగారు దుకాణాల వద్దనే తనిఖీలు చేస్తుండడంతో వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. లక్ష నుంచి 12 లక్షల్లోపు తీసుకెళుతున్న అందరినీ పట్టుకుని డబ్బులు సీజ్ చేయడంతో పాటు ఇన్‌కంట్యాక్స్ రాస్తామని చెప్పడంతో వ్యాపారులు, సామాన్యులు కూడా డబ్బుతో పోవాలంటే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఎన్నికల సమయం కాబట్టి ఎవరైనా రాజకీయ నాయకులు, అతని అనుచరులను తనిఖీ చేసి డబ్బులు పట్టుకున్నా అభ్యంతరాలు ఉండవని, ఇలా వ్యాపారులపై పడడం సరికాదన్నారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు బంగారు కొనుగోలు చేసేందుకు వచ్చే వారు కూడా పోలీసుల దెబ్బకు భయపడుతున్నారని అన్నారు. ఇటీవల అధికార పార్టీకి చెందిన నేతలే బంగారు వ్యాపారులను పట్టిస్తున్నారని ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ వ్యవహారంపై ఎస్పీ సానుకూలంగా స్పందించారని, పది లక్షల లోపు అయితే డీఎస్పీ స్థాయి అధికారే విడుదల చేస్తారని, అయితే ఆ డబ్బు విడుదలకు రెండురోజులు సమయం పడుతుందని, పదిలక్షలకు పైగా పట్టుబడితే సీజ్ చేసి ఇన్‌కంట్యాక్స్‌కు పంపిస్తామని చెప్పారన్నారు. ఇటీవల తాళ్లప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి తన పత్తిని తీసుకుని తాడిపత్రిలో అమ్మి రూ.6లక్షలతో తిరిగి వస్తుండగా ఇలాగే పట్టుకుని నగదు చేశారన్నారు. అధికారులు కూడా చిన్న చితక అమౌంట్లు అయితే పూర్తి వివరాలు సేకరించి వదిలేయడం మంచిదన్నారు.

రోడ్డు భద్రతా చర్యలు పటిష్టం చేయాలి

- కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), జనవరి 24: రోడ్డు భద్రతా చర్యలను పటిష్టం చేసేందుకు అధికారులు కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, ఏఎస్పీ తుసార్ డూడి, కమిటీ కన్వీనర్ డీటీసీ మీరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధికంగా ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల న్నారు. విద్యాసంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పెట్రోల్ బంకులు, బ్యాంకులు, కమర్షియల్ కాంప్లెక్సుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రవాణాశాఖ వారు ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డీఈలు మాధవి, విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ నాగరాజు, డాక్టర్ రమాదేవి, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం రూ.1.42 కోట్లు



కడప (మారుతీ నగర్), జనవరి 24: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీకి రూ.1.42 కోట్ల ఆదాయం సమకూరింది. సంక్రాంతి కోసం కడప రీజియన్ పరిధిలోని కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల డిపోల నుంచి సుమారు 508 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆ బస్సుల ద్వారా పండుగకు ముందుగా విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, నెల్లూరు, తిరుపతి తదితర ప్రాంతాలలో ఉన్న జిల్లా ప్రజలు ఇక్కడకు చేర్చారు. పండుగ అనంతరం వారిని తిరిగి ఆయా ప్రాంతాలకు చేర్చడం ద్వారా ఆర్టీసీకి రూ.1,42,20,636 ఆదాయం సమకూరినట్లు ఆర్టీసీ కడప రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇందులో కడప డిపో నుంచి 166 బస్సులకు గాను రూ.50,47,909, పులివెందుల డిపో నుంచి 73 బస్సులకు రూ.19,85,077, బద్వేల్ డిపో నుంచి 62 బస్సులకు రూ.18,02872, జమ్మలమడుగు డిపో నుంచి 68 బస్సులకు రూ.17,76,974, మైదుకూరు డిపో నుంచి 54 బస్సులకు రూ. 15,21,688, ప్రొద్దుటూరు డిపో నుంచి 85 బస్సులకు రూ.20,86,116 మొత్తంగా 508 బస్సులకు కలిపి రూ.1,42,20,636 ఆదాయం కడప రీజియన్‌కు సమకూరినట్లు వెల్లడించారు.

వ్యవసాయాన్ని లాభాల బాటలో నడిపించాలి

- జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్

కడప(కలెక్టరేట్), జనవరి 24: వ్యవసాయ, అనుబంధ రంగాలను మరింత లాభాల బాటలో నడిపించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలని జాయింట్ కలెక్టర్ జి.గణేశ్ కుమార్ జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని స్పందన హాల్లో రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహాబోర్డు చైర్మన్ శివప్రసాద్ రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు తిరుపాల్ రెడ్డి, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఝాన్సీరాణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందివ్వాలన్నారు. ఈ రబీ సీజన్లో సాగు విస్తీర్ణం 1.49 లక్షల హెక్టార్లకు గాను 99.230 హెక్టార్లలో సాగు జరిగిందన్నారు. ఈ-క్రాప్ 97.92శాతం నమోదు జరిగిందన్నారు. 2023-24 ఖరీఫ్ సీజన్లో 2,28,530 మంది రైతులకు క్రాప్ లోను మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, అనుబంధ రంగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్

కలెక్టరు ఔదార్యం

- వృద్ధురాలికి ఇల్లు కొనిచ్చారు



లక్ష్మీదేవికి ఇంటిపత్రాలు అందిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర అధికారులు

పెద్దముడియం, జనవరి 24: కలెక్టరు విజయరామరాజు ఓ వృద్ధురాలి పట్ల తన ఔదార్యాన్ని ప్రదర్శించారు. గత నెల 15న పెద్దముడియంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పెద్దముడియం గ్రామానికి చెందిన తుమ్మలూరు లక్ష్మీదేవి అనే వృద్ధురాలు తనకు ఇల్లు మంజూరు చేయాలంటూ కలెక్టరు విజయరామరాజుకు దరఖాస్తు ఇచ్చారు. దాదాపు 90 ఏళ్ల వయసున్న ఆమె బాడుగ ఇంటిలో నివాసం ఉంటోంది. దీంతో ఆమె అద్దెకు నివసిస్తున్న ఇంటియజమానితో మాట్లాడించి సుమారు రూ.1.50లక్షలు కలెక్టరు సొంత నిధులు ఇచ్చి ఆ ఇంటిని కొన్నారు. దానిని జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో వృద్ధురాలి పేరిట రిజిస్టరు చేయించి పత్రాలు బుధవారం అందించారు. తన వినతి మన్నించి సొంత ఖర్చులతో ఇంటిని అందించిన కలెక్టరుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు జ్యోతిరత్నకుమారి, ఎంపీడీవో వెంకటరమణయ్య, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే.. టీడీపీపై బురద చల్లే ప్రయత్నం

- వచ్చే ఎన్నికల్లో వైసీపీ మట్టికరవడం ఖాయం
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



కడప (ఎడ్యుకేషన్), జనవరి 24: వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తున్నామని టీడీపీపై బురద చల్లే కార్యక్రమం చేపట్టారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఓటమి భయంతోనే జగన్ పత్రికలో విషపు రాతలు రాయిస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం మట్టి కరవడం ఖాయమని స్పష్టం చేశారు. బుధవారం కడప నగరం ద్వారకానగర్‌లోని తన కార్యాలయంలో శ్రీనివాసులరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేతలు భూకబ్జాలు, ఇసుక, మట్టి, మట్టిమాఫియా అవినీతి కోరల్లో చిక్కుకున్నారని అన్నారు. టీడీపీకి ప్రజల్లో బలం పెరిగిందని వైసీపీ బలహీనపడడంతో జగన్ పత్రికలో టీడీపీ ఇన్‌చార్జిలు, నాయకులపై విషప్రచారం చేస్తున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా భూకబ్జాలు, అక్రమ లే అవుట్లు వేసినందుకు ఆయనకు గౌరవం ఇవ్వాలా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలు కనబడితే బుద్ధి చెప్పడానికి ముస్లిం మహిళలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ తన సొంత చెల్లెలికి కూడా గౌరవం ఇవ్వడంలేదని ఇక రాష్ట్ర మహిళలకు ఆయన ఏం గౌరవం ఇస్తారని చెప్పారు. ఎన్ని కుట్రలు పన్నినా టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు.


రాళ్లదాడి కేసులో.. నిందితుల అరెస్టుకు ఎస్పీ ఆదేశాలు?

- అజ్ఞాతంలోకి ప్రొద్దుటూరు వైసీపీ కౌన్సిలర్లు, నేతలు

ప్రొద్దుటూరు, జనవరి 24: ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ రెడ్డి ఇంటివద్ద 2022 అక్టోబరులో జరిగిన రాళ్ల దాడికి సంబంధించి త్రీటౌన్ పోలీసు స్టేషన్లో 307 తదితర సెక్షన్ల కింద నమోదైన కేసులో నిందితుల అరెస్టుకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ కేసులో అప్పట్లో టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి సహా 11 మందిపై అలాగే.. వైసీపీకి చెందిన చెందిన 15 మందిపై 307 సెక్షన్ కేసు నమోదు చేశారు. టీడీపీకి చెందిన ప్రవీణ్‌రెడ్డితో సహా నలుగురిని అరెస్టు చేశారు. ఆ తరువాత వారు బెయిల్‌పై బయటికి వచ్చారు. టీడీపీలో మిగిలిన వారంతా ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. వైసీపీకి చెందిన భూమిరెడ్డి సుదర్శన్‌రెడ్డితో సహా మరో నలుగురిని కూడా అరెస్టు చేయగా వారూ బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆ కేసులో ఉన్న వైసీపీ కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, ద్వార్శల గురునాథరెడ్డి, ఇల్లూరు దస్తగిరిరెడ్డి, అక్రమ్, ఫరూక్, రవి, మంచాల చెన్నయ్య అలియాస్ రైస్, కిశోర్, సుబ్బరాయుడు, మరికొందరు మహిళలను పోలీసులు అరెస్టు చేయలేదు. వీరు ముందస్తు బెయిలూ తెచ్చుకోలేదు. ఇటీవల ఓ కేసుకు సంబంధించి టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి త్రీటౌన్ పోలీసు స్టేషను వద్దకు చేరుకుని 307 కేసులో ఉన్న వైసీపీ నేతలను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. అది మీడియాలో రావడంతో ఎస్పీ దృష్టికి వెళ్లిందని అంటున్నారు. దీంతో 18 నెలలుగా నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని సంబంధిత పోలీసు అధికారులపై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో త్రీటౌన్ పోలీసులు వైసీపీ నేతల అరెస్టు కోసం రంగంలోకి దిగారని తెలిసింది. ఈ సమాచారం తెలుసుకున్న వైసీపీ నేతలంతా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ప్రొద్దుటూరులో ప్రచారం జరుగుతోంది. దీనిపై సీఐ వెంకటరమణను ఆంధ్రజ్యోతి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది.

పోలీసులకు జగన్ పంగనామాలు

- టీఏ విడుదలంటూ ఉత్తుత్తి జీవోలు
- నెల కావస్తున్నా.. పైసా రాని వైనం
- సరెండర్ లీవులదీ అదే దారి
- దాచుకున్న సొమ్ముకు గడువు దాటినా ఎదురు చూపులే
- ఖాకీ కళ్లల్లో కన్నీళ్లు



(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చెప్పే డైలాగ్ ఒక్కటే. మాట తప్పను మడమ తిప్పను. ఇచ్చిన మాట కోసం కట్టుబడి ఉంటాను.. ఇదే డైలాగ్‌ను వైసీపీ ప్రారంభించిన తరువాత ప్రతిసారీ చెప్పేవారు. ఎలాగంటే జగన్ అండ్ కో బాషలో అలవి కాని, చేతకాని, చేయలేని, అంత సీన్ లేని హామీలను కూడా పదే పదే చెబితే అది జనాల్లో ఉంటుంది. దాన్ని ప్రచారం చేసేందుకు సొంత పత్రిక, కూలీ మీడియా ఉంది. ఏది చెప్పినా అంతా ఒకే అంటారు. అందుకేనేమో జగన్ కూడా ప్రతీది చెప్పుకొచ్చారు. ఎన్నికల ముందు సామాన్యులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులకు హామీ ఇచ్చారు. గద్దె నెక్కాక జగనేందిరో.. నేను ఇచ్చేదేందిరో అన్న విధంగా తయారైంది. జగన్ పాలనలో కొందరు సామాన్యులే కాదు ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, జర్నలిస్టులు చివరికి పోలీసులు కూడా బాధితులే. హామీ ఇచ్చి మాట తప్పి నాలుక మడత పెట్టారు.

పోలీస్.. ఈ పేరు ఒకప్పుడు అసాంఘిక శక్తులకు, దొంగలకు, రౌడీషీటర్లకు ఇతర నేరగాళ్ల బ్యాచ్‌కు వార్నింగ్ ఇచ్చేవారు. అంతెందుకు ఒకప్పుడు జనానికి ఏదైనా సమస్య వస్తే పోలీసులు ఉండేవారు. అయితే జగన్ వచ్చాక పోలీసులను వైసీపీ ప్రైవేటు సంస్థగా మార్చారంటూ టీడీపీ తీవ్రంగా ఆరోపణలు చేస్తోంది. అయినా కూడా కొందరు పోలీసులు వైసీపీ వాళ్ల ఆదేశించారు.. మేం చేస్తున్నాం అన్నట్లుగా పనికిరాని పనులు కూడా చేశారనే విమర్శలున్నాయి. పోలీసులను ఇంతగా గత ప్రభుత్వాలు వాడుకున్న సంఘటనలు లేవంటారు. ఇప్పుడంతా గ్రామాల్లో ఏదైనా గొడవలు జరిగినా కేసు కట్టాలన్నా వైసీపీ నేతల సిఫారసు.. ఇలా ఒకటేంటి వైసీపీ నేతల ఆశీస్సు లు లేకుంటే స్టేషన్‌లోకి రానివ్వరు కదా, కనీసం ఎఫ్ఐఆర్ రాయరనేది జనం నుంచి ప్రచారం ఉంది.

వైసీపీ అధికారంలోకి వస్తే అందరి మాదిరిగానే మీకు మేలు చేస్తామంటూ పోలీసులకు హామీలిచ్చింది. అయితే వాటికి పంగనామాలు పెట్టారు. రోజుకు 225 చొప్పున పోలీసులకు నెలనెలా ఏడురోజులు టీఏ ఇవ్వాల్సి ఉంది. అంటే ఒక్కొక్కరికి రూ.1575 వస్తుంది. విధుల్లో భాగంగా ముఖ్యమంత్రి ఇతరత్రా భద్రత కోసం పోలీసులు సొంత డబ్బులు పెట్టుకుని వస్తుంటారు. అయితే గత నెల 15న ఆ టీఏలకు సంబంధించి మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఇంత వరకు ఒక్క పైసా ఇవ్వలేదంటారు.

ప్రతి ఉద్యోగికి సెలవులు ఉంటాయి. అయితే పోలీసులకు ఉండవు. వాళ్ల డ్యూటీ అంతా 24/7. విధుల్లో ఉంటారు. అయితే చాలా మంది పోలీసుల సెలవులు మిగిలిపోతుంటాయి. వీరందరికీ ప్రభుత్వం సరెండరు లీవుల పేరుతో వారికి వచ్చే వేతనాల ఆధారంగా.. ఉదాహరణకు ఓ కానిస్టేబుల్‌కు 70వేలు జీతం వస్తే సరెండరు లీవు రూ.35వేలు వస్తుంది. అయితే 2023కు సంబంధించిన సరెండరు లీవు రాలేదంటారు. ఇక ఏపీజీఎల్ఐ అంటే ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు ఇన్సూరెన్స్ స్కీంలో కొందరు పోలీసులు ఉన్నారు. వారి జీతంలోంచి కొంత కట్ చేస్తుంటారు. గడువు పూర్తయిన తరువాత వారికి డబ్బులు ఇవ్వాల్సి ఉంది. అది రూ.3లక్షల నుంచి 5 లక్షల వరకు ఉంటుంది. జిల్లాలో మొత్తం 3వేల మంది పోలీసులు ఉంటారు. చాలామందికి ఇదే వర్తిస్తుంది. ఇక జీపీఎఫ్ వచ్చిన జీతంలో సొంతిల్లు కట్టుకోవడం, పిల్లల చదువు, పెళ్లిళ్లు, అనారోగ్యాలకు గురైతే ఆపరేషన్లకు ఇతరత్రా వాటికి డబ్బులు దాచుకుంటారు. ఆ గడువు పూర్తయినా కూడా డబ్బులు ఇవ్వకపోవడం పోలీసులను ఆవేదనకు గురి చేస్తోంది.

వైసీపీ ప్రభుత్వం కళ్లున్న కబోది

- కళ్లకు గంతలతో యూటీఎఫ్ నేతల నిరసన

కడప (ఎడ్యుకేషన్), జనవరి 24: వైసీపీ ప్రభుత్వం కళ్లున్న కబోదిలా వ్యవహరిస్తోందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కళ్లకు గంతలు కట్టుకుని మహావీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల అండతో అధికారంలోకి వచ్చిన జగన్ ఉద్యోగ ఉపాధ్యాయులను విస్మరించడం తగదన్నారు. అధికారంలోకి వచ్చిన వారం లోపే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలపాటు కాలయాపన చేసి ఓపీఎస్ విధానంపై అవగాహన లేకే హామీ ఇచ్చామని నిస్సిగ్గుగా ప్రకటించడం దుర్మార్గమన్నారు. ఉద్యోగుల పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్ము సైతం కాజేసి ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించిందని ఆరోపించారు. తక్షణం పీఆర్సీ అమలుకు చర్య లు తీసుకోవాలని, అమలయ్యే వరకు 30 శాతం ఐఆర్ చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించకపోతే 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వై.రవికుమార్, కె.నరసింహారావు, సీవీ రమణ, ఎ.శ్రీనివాసులు, ఎజాజ్ అహ్మద్, నాగరాజు, సమీర్‌బాషా, గోపీనాథ్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు

పర్యాటక వారసత్వాన్ని స్ఫురింపజేసేది అలపర్తి రచన

● వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైస్ చాన్సలర్ చింతా సుధాకర్, తదితరులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 24 : భారత దేశానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని, అందులోని సంస్కృతి వారసత్వాన్ని రేపటి తరానికి పర్యాటకం పేరుతో పుస్తకాన్ని పరిచయం చేసిన రచయిత అలపర్తి పిచ్చయ్యచౌదరి కృషి ప్రశంసనీయమని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. బుధవారం కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యామండలి విశ్రాంత సంయుక్త కార్యదర్శి పిచ్చయ్యచౌదరి రచించిన పర్యాటకం రూట్స్ అండ్ ఫ్రూట్స్ ఆఫ్ టూరిజం పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఇంటాక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా సుధాకర్ మాట్లాడుతూ భారతదేశం దేవతలు నడయాడిన భూమి అని, అందుకే కర్మభూమిగా అభివర్ణిస్తామని పేర్కొంటూ.. ప్రపంచ దేశాలన్నింటికంటే మనదేశానికి గొప్ప చారిత్రక నేపథ్యం ఉందని వివరించారు. ఇంటాక్ కడప చాప్టర్ చైర్మన్ కె.చిన్నపరెడ్డి, ప్రిన్సిపల్ వి.సలీంబాషా, జి.రవీంద్రనాథ్, వైవీయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసరు మల్లిఖార్జున రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రాజు, ఎస్ఎండీ బాషా, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు సురేష్‌బాబు పాల్గొన్నారు.

మూగ జీవాల పట్ల కరుణ చూపాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జనవరి 24: ప్రతి ఒక్కరూ మూగ జీవాలపట్ల ప్రేమ, కరుణ చూపేలా సమాజంలో అవగాహన పెంచాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో ఎస్పీసీఏ జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 14వ తేదీ నుంచి 30 వరకు జిల్లాలో నిర్వహిస్తున్న జంతు సంక్షేమ పక్షోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అందులో భాగంగా గోశాలల సందర్శనతో పాటు పాఠశాలల్లో కైండ్‌నెస్ క్లబ్బులు, జంతువుల పట్ల దయతో వ్యవహరించడం వంటి అంశాలపై అవగాహన పెంపొందించేలా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 14న వసంత పంచమి రోజున 'జీవ జంతు కళ్యాణ్ దివస్' కార్యక్రమాన్ని అన్ని కార్యాలయాల్లో నిర్వహించాలన్నారు. జంతు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, ఏఎస్పీ తుషార్ డూడి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఆంగ్లంపై నైపుణ్యం కలిగి ఉండాలి


మాట్లాడుతున్న డీఈవో రాఘవరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 24: ప్రతి ఉపాధ్యాయుడు ఆంగ్లంపై నైపుణ్యం కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరం జయనగర్ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో స్టాండర్డ్ టెస్ట్ ఆఫ్ ఇంగ్లీషు ప్రొఫెషియన్సీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆంగ్ల నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఇదొక పెద్ద అవకాశమని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎస్‌టీఈఆర్‌టీ పర్యవేక్షకుడు డాక్టర్ గిరిబాబు యాదవ్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి ధనలక్ష్మి, కోర్సు డైరెక్టరు భాగ్యవతి పాల్గొన్నారు.

పరిహారం ఎప్పుడిస్తారో?

● జాతీయ రహదారికి ఇళ్లు కోల్పోతున్న బాధితుల ఆవేదన

● 60 మందికి అందని పరిహారం


లక్కిరెడ్డిపల్లెలోని జడ్పీ పాఠశాల నుంచి మిస్సా చర్చి వరకు పరిహారం ఇవ్వని ఇళ్లు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 24: వేంపల్లె నుంచి రాయచోటి వరకు ఏర్పాటు చేస్తున్న జాతీయ రహదారిలో భాగంగా లక్కిరెడ్డిపల్లె మండల కేంద్రంలో స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న బాధితులకు కొందరికి పరిహారం అందలేదు. పనులు ప్రారంభించి రెండేళ్లయినా తమకు ఇంకా పరిహారం అందకపోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్కిరెడ్డిపల్లె మండల కేంద్రంలో 366 మంది బాధితులకు 33.88 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. చింతకుంటపల్లె నుంచి లక్కిరెడ్డిపల్లె మిస్సా చర్చి వరకు రోడ్డుకు ఇరుపక్కల ఉన్న ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న కొంతమంది బాధితులకు మాత్రమే పరిహారం అందించారు. అయితే వీరిలో చింతకుంటపల్లె నుంచి లక్కిరెడ్డిపల్లె బాలుర హైస్కూల్ వరకు 280 మందికి పరిహారాన్ని అందించారు. మిగిలిన 86 మంది బాధితులకు రెండు సంవత్సరాలైనా ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని బాధితులు వాపోతున్నారు. అయితే ఇప్పటికే లక్కిరెడ్డిపల్లె, చింతకుంటపల్లె రోడ్డుకు ఇరుపక్కల ఇళ్లను పగలకొట్టి పనులు చేస్తున్నారు. మిగిలిన వాటి గురించి పట్టించుకునే నాథుడే లేరని బాధితులు వాపోతున్నారు. హైస్కూల్ గేటు నుంచి మిస్సా చర్చి వరకు ఉన్న ఇళ్లకు ఇంతవరకు పరిహారం అందించలేదని, వాటి గురించి పట్టించుకొనే నాథుడే లేరని బాధితులు అంటున్నారు. 60 ఇళ్లు కోల్పోతున్నవారు మాకు పరిహారం తక్కువ రాశారని ఈ విషయంపై రెవెన్యూ అధికారులను అడిగితే జాతీయ రోడ్లు రవాణా వారు వేసి ఇచ్చిన ఎస్టిమేషన్ ప్రకారం కొలతలను బట్టి పరిహారం కోసం కలెక్టర్‌కు నివేదికలు పంపించామని చెబుతున్నారన్నారు. 20 అడుగులు స్థలం కోల్పోయిన వారికి కేవలం 5 నుంచి 7 లక్షల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని మాకు న్యాయం జరగలేదని బాధితులు అంటున్నారు. దీనికి తోడు 1190, 1191 సర్వే నెంబర్లు గల ఈ భూమిని వేరే వ్యక్తి 50 సంవత్సరాల క్రితం 5 ఎకరాలు విక్రయించారని అందులో రోడ్డుకు కోల్పోతున్న భూమి తమ పెద్దల పేరిట ఉందని పెండింగ్ పెట్టినట్లు బాధితులు చెబుతున్నారు. అయితే 366 ఇళ్లు, స్థలాలు రోడ్డుకు కోల్పోతున్న బాధితులకు 33 కోట్ల 88 లక్షల 82 వేల రూపాయలు మంజూరైందని, సరైన డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ కాగితాలు కలిగిన వారికి మాత్రం ఎస్టిమేషన్, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తున్నామని రెవెన్యూ అధికారులు అంటున్నారు. అయితే మొత్తం 366 మంది బాధితులకు 10 నుంచి 20 మీటర్లు స్థలం, ఇల్లు కోల్పోతున్న వారికి తక్కువ పరిహారం ఉందని ఈ విషయాన్ని అధికారులను అడిగితే స్థలం, ఇల్లు నిర్మాణం విలువను బట్టి నివేదికలు పంపించామని అధికారులు అంటున్నారని బాధితులు మహ్మద్‌రఫి, సుబ్బరాజు, నందిబాబు తెలిపారు. ఇప్పటికే 30 కోట్ల రూపాయలు బాధితుల ఖాతాల్లో వేశామని, ఇంకా 10 కోట్ల రూపాయలు రావాలని ఆ డబ్బు వచ్చిన వెంటనే మిగిలిన 60 మందికి పరిహారం వారి ఖాతాల్లో వేస్తామని రెవెన్యూ అధికారులు అంటున్నారు. పరిహారం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిహారం అందడం లేదని బాధితులు వాపోతున్నారు.

10 కోట్ల రూపాయలు రావాలి..

మండలంలో జాతీయ రహదారికి ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న 366 కుటుంబాల నివేదికలు పంపించాం. అందులో ఎలాంటి సమస్యలు లేని ఇళ్లకు పరిహారం అందించాం. ఇంకా 86 ఇళ్లు ఉన్నాయి అందులో 26 కుటుంబాలకు చెందిన ఆస్తులకు సరైన పత్రాలు లేవు. మిగిలిన 60 కుటుంబాలకు రెండో విడతలో పంపిణీ చేస్తాం. లక్కిరెడ్డిపల్లె టౌన్‌లో అందరికీ పరిహారం అందించనంతవరకు ఇళ్లు పగలగొట్టం.

- ఉదయశంకర్‌రాజు, తహసీల్దార్

ఎవరూ పట్టించుకోవడం లేదు..



2020 సంవత్సరంలో కొత్త ఇల్లు కొన్నాను. జాతీయ రహదారికి 2.7 మీటర్లు స్థలం కోల్పోయాను. ఈ విషయంపై ఎన్నోసార్లు అధికారులను అడిగినా పటించుకోలేదు. అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్ పేపర్లు ఇచ్చాం కానీ ఎవరూ పట్టించుకోలేదు. పరిహారం ఇచ్చిన తర్వాతే ఇల్లు పడగొట్టండి. లేకుంటే అందుకు ఒప్పుకునేదే లేదు.

- దర్బార్‌బాషా, బాధితుడు

స్థలం పోయేది ఎక్కువ.. పరిహారం తక్కువ..



రోడ్డుకు 20 అడుగుల స్థలం పోతుంది. ఈసీ విలువ 15 లక్షల రూపాయలు ఉంది. రూ.5 లక్షలు మాత్రమే వస్తుందని అధికారులు అంటున్నారు. స్థలానికి తగ్గట్టు పరిహారం అందించాలి, లేదంటే ఇంటిని కూల్చనీయం. మొదటి నుంచి ఇటువైపు స్థలం గల వారు ఎవరో కోర్టుకు వెళ్లారని పరిహారం ఇవ్వకుండా అధికారులు నాన్చుతున్నారు. ఈసీ ప్రకారం పరిహారం చెల్లించాలి.

- సుబ్బరాజు, బాధితుడు

రామాలయంలో దొంగలు పడ్డారు

బంగారు గొలుసు, వెండి కిరీటాలు అపహరణ


వేంపల్లెలో చోరీ జరిగిన రామాలయం, సీతారాముల వద్ద రోల్డ్‌గోల్డ్ నగలు

వేంపల్లె, జనవరి 24: వేంపల్లె పట్టణం పులివెందుల రోడ్డులోని టీచర్స్ కాలనీ రామాలయంలో దొంగలు పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని దొంగలు ఆలయం తలుపు చిలుకులను పెకిలించి దొంగతనం చేశారు. సీతాదేవి బంగారు గొలుసు, సీతారామలక్ష్మణ హనుమ విగ్రహాల వెండి కిరీటాలు ఇతర ఆభరణాలు దోచుకెళ్లారు. సుమారు నాలుగు లక్షల రూపాయల విలువైన బంగారు, వెండి ఆభరణాలు తీసుకెళ్లినట్లు కాలనీ వాసులు తెలిపారు. సీఐ చాంద్‌బాష ఆలయాన్ని పరిశీలించి స్థానికులను విచారించారు. పూర్తి వివరాలిలా.. వేంపల్లె పట్టణ సమీపంలోని పులివెందుల సమీపంలో టీచర్స్ కాలనీ వద్ద రామాలయం ఉంది. అయోధ్య బాలరాముడి ప్రతిష్ఠ పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఆభరణాలు అలంకరించి పూజలు చేశారు. వీటి గురించి తెలిసి గుర్తుతెలియని దొంగలు పక్కా ప్రణాళికతో మంగళవారం అర్ధరాత్రి దాటాక ఆలయం చిలుకును పెకలించి బంగారు, వెండి ఆభరణాలను తీసుకెళ్లారు. రోల్డ్‌గోల్డ్ నగలను ఉంచి వెళ్లారు. దీన్ని బట్టిపూర్తి సమాచారం తెలుసుకున్న వారే ఈ దొంగతనం చేసినట్లు ప్రాథమికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నాలుగు రోజులు జైలు శిక్ష

నందలూరు, జనవరి 24: మద్యం తాగి వాహనం నడిపినందుకు ఆవుల పులికొండ అనే వ్యక్తికి నందలూరు జూనియర్ సివిల్ జడ్జి లత నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన ఆవుల పులికొండ అనే వ్యక్తిని డ్రంకెన్ డ్రైవ్ కేసులో స్థానిక పోలీసులు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 4 రోజులు జైలుశిక్ష విధించారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం రాజంపేట సబ్‌జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం లారీ బోల్తా



పోరుమామిళ్ల, జనవరి 24 : కలసపాడు మండలంలోని చింతలపల్లె సమీపంలో మద్యం లారీ బోల్తా పడింది. సింగరాయ కొండ నుంచి కడపకు మద్యం తీసుకువెళుతున్న లారీ బుధవారం తెల్లవారుజామున చింతలపల్లె సమీపంలో రోడ్డుకిరువైపులా తూములు ఉండడంతో ఎదురుగా బండి రావడంతో పక్కనున్న గుంత కనబడక బోల్తాపడింది. వెంటనే డ్రైవర్లు కలసపాడు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. వారు సంఘటనాస్థలానికి చేరి ఎవరూ మద్యం తీసుకుపోకుండా చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి



ముద్దనూరు, జనవరి24: మండల పరిధి కడప-తాడిప్రతి హైవేలోని చింతకుంట గ్రామ సమీపంలో మోటర్ బైకు గుంతలో పడిన ఘటనలో గాయపడిన జీవన్‌కుమార్(16)అనే యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు.అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన జీవన్‌కుమార్ శనివారం ముద్దనూరు వైపు నుంచి తన స్నేహితుడు మోక్షేశ్వరరెడ్డితో కలిసి మోటార్ బైకులో తాడిపత్రికి వెళుతుండగా చింతకుంట సమీపంలో ప్రమాదవశాత్తు బ్రిడ్జి ఏర్పాటు కోసం తీసిన గుంతలో పడ్డారు. ఈ ప్రమాదంలో బైకుపై వెళుతున్న ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. జీవన్‌కుమార్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గణతంత్ర వేడుకలకు పక్కా ఏర్పాట్లు చేయండి : జేసీ

కడప(కలెక్టరేట్), జనవరి 24: గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై అదనపు ఏఎస్పీ కృష్ణారావు, డీఆర్వో గంగాధర్ గౌడ్‌లతో కలసి అన్ని శాఖల అధికారులతో జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈనెల 26న స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటి చెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మధుసూదన్, డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలను నియంత్రించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


సమావేశంలో మాట్లాడుతున్న ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 24: జిల్లాలో మాతా శిశు మరణాల జరగకుండా నియంత్రించేందుకు అవసరమైన పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మాతా శిశు మరణాల నివారణపై వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాతృమరణాలు, శిశు మరణాలు జరగకుండా సంబంధిత అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీల పరిధిలో హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న వారిని గుర్తించడం లేదని, హైరిస్క్ ఉన్న వారిని గుర్తించాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశావర్కర్లు, మెడికల్ అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు.

సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో సమావేశాలు నిర్వహించినప్పుడు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు మాతా శిశు మరణాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇక నుంచి హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశాలు పెట్టుకుని మరణాలు సంభవించకుండా ఉండేటట్లు వారికి తెలియజేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న హైరిస్క్ గర్భిణులను పరీక్షించి వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, డాక్టర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు ముందు చేసుకోవడం తెలియదా !

● అధికారులపై జేసీ మండిపాటు


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ గణేశ్‌కుమార్

మైదుకూరు, జనవరి 24 : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న స్థానిక అధికారులపై జేసీ గణేశ్‌కుమార్ మండిపడ్డారు. మైదుకూరులో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తొలినుంచి అధికారులు చిత్తశుద్ధిగా వ్యవహరించలేదనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయిలో పోటీలు కూడా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపక పోవడంతో జాయింట్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పోటీలు ఉదయం 8.30 గంటలకే ప్రారంభం కావాల్సిఉండగా ఏర్పాట్లకు తగిన పరికరాలు లేకపోవడంతో 10.30కి ప్రారంభించారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కూడా ఆటలు ప్రారంభం కాక మునుపే 9 గంటల ప్రాంతంలో వచ్చి కేవలం క్రీడాకారులను పరిచయం చేసుకొని వెళ్లిపోయారు.

క్రికెట్ ఆడేందుకు పిచ్‌పైన మ్యాట్ లేక పోవడం, ఆట ప్రారంభించడంతో క్రీడాకారులు వెయిట్ చేశారు. ఈ క్రమంలోఆకస్మికంగా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అక్కడికి చేరుకోవడం, విషయం తెలుసుకొని సంబంధిత అధికారులతో క్రీడలకు తగిన ఏర్పాట్లు ఎందుకు చేసుకోలేదు, తగిన పరికారాలు అన్ని కూడా ముందే మీకు పంపాము కదా ఇంత నిర్లక్ష్యం అయితే ఎలా అంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరమణ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి చంద్రమోహన్, తహసీల్దారు అనురాధ, కమిషనరు రంగస్వామి, ఎంఈవో పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షురాలిగా సమీరా



కడప (ఎడ్యుకేషన్), జనవరి 24: ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షురాలిగా సమీరా ఏకగ్రీవంగా ఎంపికైనట్లు జాతీయ ఉపాధ్యక్షుడు సాయిక్రిష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సమీరా మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అనునిత్యం కృషి చేస్తామన్నారు. విద్యార్థి, విద్యాశాఖ సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు.

పరిపూర్ణ మనుషులుగా మార్చడం అభినందనీయం

కడప (క్రైం), జనవరి 24 : ఖైదీలను పరిపూర్ణ మనుషులుగా మారుస్తున్నారని జైలు అధికారుల పనితీరును వైవీయూ ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి కొనియాడారు. కడప కేంద్ర కారాగారంలోని ఆడిటోరియంలో పునశ్చరణ తరగతులు రెండోరోజు 8 జిల్లాలకు సంబంధించి జైలు సిబ్బందితో నిర్వహించారు. కడప సెంట్రల్ జైలు పర్యవేక్షణాధికారి ఐఎస్‌హెచ్ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఈ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో జైలు అధికారులు రాజేశ్వర్‌రావు, జవహర్ బాబు, సాంబశివరావు, భాస్కర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఖేలో ఇండియాకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు


చాంపియన్ షిప్‌కి ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, జనవరి 24: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఖేలో ఇండియా సౌత్‌జోన్ కింద చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి గుప్త పేర్కొన్నారు. ఖేలో ఇండియా సౌత్ జోన్ యోగా పోటీల్లో వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులను, యోగా శిక్షకులను బుధవారం ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో డైరెక్టర్‌తో పాటు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ షంషాద్‌బేగం, సాంస్కృతిక డ్యాన్స్ మాస్టర్ ఖాన్‌బాషాలు అభినందించారు.

విద్యార్థులతో ట్రైనీ కలెక్టర్ సహపంక్తి భోజనం


బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ట్రైనీ కలెక్టర్

ఎర్రగుంట్ల, జనవరి 24: ట్రైనీ కలెక్టర్ భరద్వాజ ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలను బుధవారంసందర్శించారు. మధ్యాహ్నం ఆయన తరగతి గదుల్లోకెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. కొన్ని జనరల్ ప్రశ్నలు వేసి వారితో సమాధానం రాబట్టారు. అలాగే మధ్యాహ్న భోజనం ఎలావుందని అడిగారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన చేశారు. హెడ్‌మాస్టర్ రామాంజనేయరెడ్డి పాఠశాల స్థితిగతులను ఆయనకు వివరించారు. ల్యాబ్ మరికొన్ని వసతులపై జేసీ ఆరా తీశారు. ఈకార్యక్రమంలో ఎంఈవో శివప్రసాద్, హెచ్ఎం రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29 నుంచి విద్యుత్‌చార్జీలపై ప్రజాభిప్రాయసేకరణ

పులివెందులరూరల్, జనవరి 24: పులివెందులలో ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమం ఏర్పాటు చేయను న్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వ ర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను అమలు చేయనున్న విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. పులివెందుల డివిజన్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని.. ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

చెన్నూరులో 'బాబుతో భవిష్యత్తు గ్యారంటీ'

చెన్నూరు, జనవరి 24 : రాష్ట్రంలో వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో పేద మధ్యతరగతి కుటుంబాలు చార్జీలు, ధరల పెరుగుదలతో ఇబ్బంది పడ్డారని... ఇలాంటి పాల నకు శాశ్వత సమాధి కట్టాలని మండల కన్వీనరు కె.విజ యభాస్కర్‌రెడ్డి అన్నారు. చెన్నూరులో బుధవారం బాబుతోనే భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటా తిరుగుతూ టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ అన్ని కుటుం బాలకు అందుతాయన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఐ.శివారెడ్డి మైనార్టీసెల్ జిల్లా నాయకులు షబ్బీర్ హుస్సేన్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, టీడీపీ నేతలు జడ లక్ష్మీనారాయణ, అతికారి విశ్వం పాల్గొన్నారు.

నూతన ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోండి

కడప (కల్చరల్) జనవరి 24: కడప నగరంలో ప్రసిద్ధి గాంచిన ఆలయాలకు సంబంధించి నూతన ధర్మకర్తల మండలికి ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ఆలయాల కార్యనిర్వహణ అధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. పాలకొండరాయ దేవస్థానం (పాలకొండ), మృత్యుంజ యేశ్వరస్వామి దేవస్థానం (మృత్యుంజయకుంట), ప్రస న్న విశ్వేశ్వరస్వామి దేవస్థానం (మోచంపేట), సోమే శ్వరస్వామి దేవస్థానం (దేవునికడప)నకు జిల్లా దేవ దాయ, ధర్మాదాయశాఖ అధికారి నూతన ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్లు జారీ చేసినట్లు తెపారు. 20 రోజుల వ్యవధిలో దరఖాస్తులను పంపించాలని కోరారు. దరఖాస్తులు మృత్యుంజయేశ్వరస్వామి దేవస్థానంలో గల కార్యనిర్వాహణాధికారి కార్యాలయంలో లభిస్తామని తెలిపారు.

బీసీల జనాభా ప్రకారం అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలి

కడప (మారుతీనగర్), జనవరి 24: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలలో అన్ని పార్టీలు కూడా అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.రెడ్డిబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విజయదుర్గాదేవి కాలనీలో సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. బీసీల జనాభా దామాషా ప్రకారంగా ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని కోరారు. కాగా, గత ఎన్నికలకు ముందు జగన్‌రెడ్డి రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దశల వారీగా మద్యనిషేదం చేస్తామని చెప్పి .. అధికారంలోకి రాగానే మాటతప్పి మడమ తిప్పారని ఎద్దువా చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజల ఓట్లు అడిగే నైతిక హక్కు జగన్‌కు లేదన్నారు.

యూఈసీడబ్ల్యుయూ రాష్ట్ర మహాసభ పోస్టరు విడుదల

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 24 :కడప నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (యుఈసీడ బ్ల్యుయూ) రాష్ట్ర మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నెల్లూరులోని జెట్టిశేషా రెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28న యుఈసీడబ్ల్యుయూ రాష్ట్ర రెండో మహాసభ నిర్వహి స్తున్నట్లు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి తెలి పారు. కార్యక్రమంలో పీసీ కొండయ్య, రియాజ్, సురేం ద్ర, శివప్రసాద్, నందీశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

60 మద్యం బాటిళ్లు పట్టివేత

వల్లూరు, జనవరి 24: మండల పరిధిలోని పలు గ్రామా ల్లో బుధవారం ఎస్ఐ వెంకటరమణ తమ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 60 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తోళ్లగంగన పల్లెలో 30 బాటిళ్లు, పెద్దపుత్తలో 20, మిట్టపల్లెలో 10 బాటిళ్లతో పాటు అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తు లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

వైసీపీని వీడి టీడీపీలోకి..

పుత్తా సమక్షంలో 50 కుటుంబాలు చేరిక

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్), జనవరి 24 : తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు కొన సాగుతున్నాయి. వైసీపీని వీడి 50 కుటుంబాలు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియో జకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారం టీ కార్యక్ర మంలో భాగంగా కమలాపురం మండలంలోని కొండాయ్యపల్లె, అప్పారావు పల్లెల్లో బుధ వారం కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం కొండాయపల్లె మాజీ సర్పంచ్ మల్లారెడ్డి కుమా రుడు మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి వారిని పుత్తా సాదరంగా ఆహ్వా నించారు. కార్యక్ర మంలో యువ నాయకులు పుత్తా చైతన్యరెడ్డి, లక్ష్మిరెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరుతున్న మహేశ్వర్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

మార్పు రావాలంటే టీడీపీకి ఓటేయండి

● పులివెందుల నియోజక వర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి

పులివెందుల టౌన్, జనవరి 24: ప్రజల జీవన స్థితిగతుల్లో మార్పు రావాలంటే తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని పులివెందుల నియోజక వర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) ప్రజలకు వివరించారు. బుధవారం మున్సి పాలిటీలోని బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఉదయం పుల్లారెడ్డి ఆసు పత్రి నుంచి చిన్నన్న రూములు తదితర ప్రాంతా లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన సాగిస్తోందని, ప్రశ్నించే వారిని గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తు న్నారన్నారు. అభివృద్ధి కుంటుపడిందన్నారు. చంద్రబాబునా యుడు విజన్ ఉన్న నాయకుడు కాబట్టే ఈరోజు హైదరాబాద్ నగరం వైపు ప్రపంచం చూస్తోంద న్నారు. గోదావరి నీళ్లను కృష్ణాలో అనుసంధా నం చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. మరో సారి చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి అయితే సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తై రాష్ట్రాన్ని సస్యశ్యామ లం చేస్తారన్నారు. కావున టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాగా, బీటెక్ రవి సతీమణి లతారెడ్డి పులివెందుల పట్టణంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పులివెందులలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో బీటెక్ రవి

సమస్యలు పరిష్కరించమంటే... నిర్బంధాలా?

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

చెన్నూరు, జనవరి 24: మున్సిపల్ కార్పొరేషన్, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించా లంటే పోలీసు నిర్బంధాలు ప్రయోగించే విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా అన్నారు. బుధవారం మండలంలోని శివాలపల్లె దళితవాడ పాఠశాల వద్దకు చెన్నూరు పోలీసులు వెళ్లి అక్కడ టీచరుగా పనిచేస్తున్న తనకు విజయవాడకు వెళ్లవద్దంటూ ముందస్తుగా నోటీసులు ఇవ్వడం తగదన్నారు. కార్పొరేషన్, మున్సిపల్ పరిధిలో ఉన్న ఉపాధ్యాయులను విద్యాశాఖలో కలిపిన ప్రభు త్వం వారి సమస్యల పరిష్కారంలో, విద్యారంగ సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని తెలిపారు. గతంలో అనేక పోరాటాలు చేసిన సమస్యల పరిష్కరిస్తామన్న అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు ఏ ఒక్క సమస్యకు పరిష్కారం చేయలేదని.. అందుకు నిరసనగా ఈనెల 25న విజయవాడలో ధర్నా నిర్వహించడానికి తాము పిలుపునిచ్చామన్నారు. అయితే ధర్నాలు నిరసన తెలిపే అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసు నిర్బంధాలు ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విజ యవాడలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మాజీ మంత్రి అహ్మదుల్లాతో శ్రీనివాసరెడ్డి భేటి

పులివెందుల టౌన్, జనవరి 24: మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత అహ్మదుల్లాతో పులివెం దుల నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి వేలూరు శ్రీనివాస్‌రెడ్డి భేటి అయ్యారు. బుధవారం మాజీ మంత్రి నివాసంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి జకరయ్యతో కలిసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కడప జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ బలాబలాలు, స్థితిగతులపై చర్చించారు. ఏఏ నియోజకవర్గాలలో కాంగ్రెస్ బలంగా ఉంది, ఆ నాయకుల గురించి వారి పరిస్థితుల గురించి చర్చించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా జిల్లాలో బలం పెంచుకొని గెలుపు వైపు అడుగుల వేసేలా ప్రజలతో మమేకం అయ్యే కార్యక్రమాల గురించి చర్చించారు. నియోజక వర్గస్థాయి, మండలస్థాయి నాయకులు వారి పనితీరుపై చర్చించారు. పులివెందుల నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు బాష, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐదో మహాసభలను జయప్రదం చేయండి

కడప (నాగరాజుపేట), జనవరి 24 : జిల్లాలో ఈ నెల 28న జరిగే ఐదో మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మహా సభల పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటి వరకు పెండింగులో ఉన్న క్లైమ్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి భవన నిర్మాణ కార్మికులను చిన్నచూపు చూస్తుంద న్నారు. సంక్షేమబోర్డు నిర్వీర్యం చేసిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వాడాలని లేనిపక్షంలో భవన నిర్మాణ కార్మికులను ఏకం చేసి ప్రభుత్వం మెడలు వంచి సంక్షేమ బోర్డును కాపాడు కుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ యూనియన్ అనుబంధ జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి లింగన్న, కడప నాయకులు నగర నాయకులు ఈశ్వరయ్య, రామాంజనేయులు, మున్నా, రవి పాల్గొన్నారు.

భానుకోటలో రామాయణ పఠనం

సింహాద్రిపురం, జనవరి 24: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పునస్కరించుకుని ఈ నెల 22వ తేదీ నుంచి 21 రోజుల పాటు పవిత్ర పుణ్య క్షేత్రమైన భానుకోటలోని రామాలయంలో రామాయణ పఠనం నిర్వహిస్తున్నారు. నిర్వహకులు శివయ్యస్వామి, భాగవత భక్త సమాజం వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్ర మం నిర్వహి స్తున్నారు. ప్రజలందరిలో సోదర భావం, సమైఖ్యతను పెంపొందించాలనే సంకల్పంతో రామా యణ పఠనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి పేర్కొన్నారు.

రేపు కార్మిక రైతు సమస్యలపై నిరసన

కడప (నాగరాజుపేట), జనవరి 24: కార్మిక రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేకవిధానాలపై ఈ నెల 26న నగరంలో ఐటిఐ సర్కిల్ వద్ద గల గాంధీ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వామపక్ష, రైతు సంఘాల జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ సుబ్బారెడ్డి, దస్తగిరిరెడ్డిలు పేర్కొన్నారు. బుధ వారం వారు విలేకరులతో మాట్లాడారు. కార్మిక, రైతులు, సామాన్య ప్రజల సమస్త ప్రయోజనాలను మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ 26న రిపబ్లిక్ డే సంద ర్భంగా క్విట్ కార్పొరేట్ దేశ్‌కి బచావో అనే నినాదంతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సికెదిన్నె, జనవరి 24: మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచ డమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనా థరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నెలో బుధవారం వైఎస్ఆర్ ఆస రా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్ర మంలో సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సు ధాకర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కళాయాదవ్, నారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం ఆపండి

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం వరు సగా మోపుతున్న విద్యుత్ చార్జీల భారాన్ని వెనక్కి తీసు కోవాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరంలోని పాత బస్టాండులో ఉన్న సీపీయం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్య మంత్రి జగన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎనిమిది సార్లు కరెంటు చార్జీలు పెంచి ప్రజానీకంపై భారం మోపారన్నారు. సీపీయం నాయకులు ఎస్.గోవిందు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కడప (చిన్నచౌకు), జనవరి 24: కడప విద్యుత్ ఉద్యోగుల సామా జిక సేవా సంఘం ఆధ్వర్యంలో రోడ్లపై నిద్రిస్తున్న పేదలకు దుప్పట్లను ఎస్ఈ ఎస్.రమణ, ఈఈ టెక్నికల్ హరిసేవానాయక్, రమేష్ కలిసి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ యూనియన్ నాయకులు చలపతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల వారి కార్యాలయము : కడప.

లేఖ నం. 12/జిజిహెచ్/కడప/2023. తేది : 24.1.2024

పత్రికా ప్రకటన

సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కడప వారి పరిధిలోని Alcohol and Drug De.Addiction Centre కడపనందు పనిచేయుటకు ఎంపిక కాబడిన Accountant / Data Manager (ఒకరు) అభ్యర్థి వివరములు www.kadapa.ap.gov.in వెబ్‌సైట్ నందు ఉంచడమైనది.

సూపరింటెండెంట్
ప్రభుత్వ సర్వజన వైద్యశాల,కడప.

'అంగన్వాడీలతో అభాసుపాలైన ప్రభుత్వం'

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 24 : నిర్బంధాన్ని ఎదిరించి కోర్కెలు సాధించుకున్న అంగన్వాడీలకు అభినందనలు తెలుపుతున్నట్లు సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డిలు అన్నారు. కడప పాతబస్టాండులో సీఐటీయూ కార్యాలయంలో విజయోత్సవసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలు 42 రోజులుగా మొక్కవోని దీక్షతో ప్రభుత్వ కుయుక్తులను ఎదుర్కొని సమ్మెను జయ ప్రదం చేసుకోవడంతో పాటు తమ కోర్కెలు సాధించుకోవడం సంతో షకరమన్నారు. సమ్మెకు మద్దతు తెలిపిన సీపీయం, సీపీఐ జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్రలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్ర మంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మిదేవి, బి.లక్ష్మిదేవి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఐఎన్ సుబ్బమ్మ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఏఐటీయూసీ మద్దిలేటి, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కడపలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ



కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 24: కడప నగరం 7వ డివిజన్‌లోని భారతీబార్ సందులో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవీరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు టీడీపీ మ్యేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అందరికీ మంచి జరగా లంటే టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో...: చెన్నూరు బస్టాండులో బుధవారం మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఆటోబాబు ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు టీడీపీ మేనిఫెస్టో వివరిస్తూ సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే లబ్ధి వివరించారు. టీడీపీ సీనియర్ నాయ కులు ఆర్.సుధాకరరెడ్డి, యువనేత మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఆసరా పేరుతో ప్రజలకు టోకరా

● టీడీపీ నేత హరిప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 24 : ఆసరా పేరుతో జగన్ ప్రభు త్వం ప్రజలకు టోకరా వేస్తో ందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యర్శి హరిప్రసాద్ తెలిపారు. ఇచ్చేది గోరంత, దోచేది మాత్రం కొండంత అన్నా రు. మహిళా సాధికారత పేరుతో మహిళలకు ద్రోహం చేస్తున్నారని తెలిపారు. బుధవారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళల తాళిబొట్లను జగన్ ప్రభుత్వం తెంచుతోందన్నారు. జగన్ పాలనలో మహిళలకు లబ్ధి రూ.15వేలకు తగ్గిపోయిందన్నారు. రాష్ట్రంలో కోటీ 14 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉంటే జగన్ ప్రభుత్వం వారిని 79 లక్షలకు కుదించా రన్నారు. రాష్ట్రంలో బాండ్లు అమ్మి వేల కోట్లు వైసీపీ ప్రభుత్వం దోచుకుంటుం దన్నారు. కల్తీ మద్యం అమ్మి 35 లక్షలమంది అనారోగ్యంపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 30వేల మంది మృత్యువాత పడ్డారని దీనిపై ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గ మన్నారు. దేశంలో మహిళలపై నేరాల రేటు 96.8 శాతం ఉందని చెప్పారు. మహిళా సాధికారత పేరుతో జగన్‌రెడ్డి మహిళలను ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. ఇండియా టుడే సర్వే ప్రకారం ఏపీలో 1,33,447 మంది వ్యభి చార కూపంలో చిక్కుకున్నా ఈ ప్రభుత్వానికి చలనం లేకపోవడం దుర్మా ర్గమన్నారు. కార్యక్రమంలో గోపిశెట్టి నాగరాజు, గంధం ప్రసాద్, ఖాజాపీర్, ఖాసిం, గంధం మోహన్‌బాబు, అమీర్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి పట్టని జగన్‌కు గుణపాఠం తప్పదు

● సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 24: కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటులో బీజేపీ, వైసీపీ దొందు దొందేనని... కడప జిల్లా అభివృద్ధి పట్టని జగన్‌కు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఎంవీ సుబ్బా రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో గాలి చంద్ర మాట్లాడారు. ఎన్నికల ముందు జగన్ కేంద్రం మెడలు వంచైనా కడప ఉక్కు పరిశ్రమ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, జాతీయ హోదా కలిగిన పోలవరానికి నిధులు, వెనుకబడి రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రైల్వేజోన్ దుగ్గిరాజ పట్నం, రెవెన్యూ లోటు భర్తీ విద్య, వైద్యరంగాల అభివృద్ధికి అవసరమైన నిధుల సాధన కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ల దాటినా ఏ రోజు వీటిపై నోరెత్తిన పాపాన పోలేదన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు రోడ్లు, రైల్వే, విమాన సౌకర్యంతో పాటు నీళ్ల, కరెంటు 27వేల ఎకరాల భూములు కలిగి ఉన్నప్పటికీ.. ఇవేవీ కేంద్ర ప్రభుత్వానికి కనిపించకపోవడం దుర్మార్గమన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు సుబ్ర మణ్యం, ఎన్.విజయలక్ష్మి, వీరశేఖర్, కేసీ బాదుల్లా, వేణుగోపాల్, భాస్కర్, మునెయ్య, మల్లిఖార్జున, నాగేశం, బ్రహ్మం పాల్గొన్నారు.

ప్రశాంతతతో బస్సులు నడపాలి : ఆర్టీసీ ఆర్ఎం



డ్రైవర్లకు గులాబీ పువ్వు అందిస్తున్న కన్యాకుమారి

కడప (మారుతీనగర్), జనవరి 24: ఒత్తిడిని దరిచేరనీ యకుండా ప్రశాంత మనసుతో బస్సును రోడ్డుపై నడపి తద్వారా బస్సులోని ప్రయాణీకులను సురక్షి తంగా వారి గమ్యస్థానా లకు చేర్చాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ (ఆర్ఎం) పి.గోపాల్‌రెడ్డి డ్రైవర్లకు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను (డ్రైవర్స్‌డే) పురస్క రించుకుని బుధవారం స్థానిక ఆర్టీసీ కడప డిపోలో డ్రైవ ర్లను ప్రత్యేకంగా కలిసి గులాబి పువ్వుతో పాటు స్వీట్లు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనం తరం ఆయన మాట్లా డుతూ ఆర్టీసీ మనుగడలో డ్రైవర్ల పాత్ర చాలా కీలకమనే సంగతి జగమెరిగిన సత్యమన్నారు. సంస్థ పురోగతికి బాటలు వేసే బస్సుల రథసారథులు మంచి అలవాట్లతో ఆరోగ్యాలను కాపాడుకుంటూ ప్రయాణీకుల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కడప డిపో మేనేజర్ డిల్లీశ్వ రరావు, అసిస్టెంట్ డిపో మేనేజర్ కన్యాకుమారి, ఎన్ఎంయూఏ కడప డిపో అధ్యక్షుడు తొండలదిన్నె జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

మెలకువలతో వరి సాగు చేపట్టాలి



కోట్లూరు గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వల్లూరు, జనవరి 24: మండలంలోని కోట్లూరు గ్రామంలో సాగుచేసిన వరి పంటను జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీ లించారు. ఈసందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మురళీక్రిష్ణ మాట్లాడుతూ ముఖ్యంగా వరి పంటలో అవసరానికి మించిన ఎరువులు వాడడం, కాంప్లెక్స్ ఎరువులు పైపాటుగా వేయడం వల్ల పంటలో కాండం కుళ్లు తెగులుతో మొక్కలు చనిపోతున్నట్లు తెలిపారు. ఇందుకు పొలంలోని నీటిని పూర్తిగా తీసివేసి రెండు రోజులు ఎండబెట్టి ప్రొఫికొనజైల్ మందు 1ఎంఎల్ లీటరు లేదా హెక్సాకొనజోల్ మందు 2ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయా లని తెలిపారు. రైతు శిక్షణ కేంద్రం అసిస్టెంటు డైరెక్టరు రమణారెడ్డి మాట్లాడుతూ పొలంలో మురుగునీరు తీసివేయడానికి కాల్వలు ఏర్పాటు చేసుకోవాలని, పంట రకాలు సరైనవి సాగు చేసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి సాయిజ్యోతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

పులివెందుల రూరల్, జనవరి 24: మహిళా హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జేవీవీ జాతీయ సమాచార కార్యదర్శి సనావుల్లా అన్నారు. బుధ వారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికల దినోత్సవ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఆడపిల్లను భారంగా భావిస్తున్నారని, పుట్టకముందే హత్య చేస్తున్నారని, బాలికలపై వివక్ష చూపడం అంటే మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవడం అనే విష యాన్ని మరచిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు కల్పించిన ప్రత్యేక చట్టాలను విద్యార్థినులకు వివరించారు. అనంతరం జాతీయ బాలికల సంరక్షణ ప్రతిజ్ఞను బాలికలచే చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాప కులు డాక్టర్ కె.విజయలక్ష్మి, వి.హేమలత, టి.లిఖిత, పి.కరీముల్లా ఖాన్, జేవీవీ నాయకులు మహమ్మద్ యూనస్, మహిళా పోలీసులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈకేవైసీ చేసుకోవాలి



వెలిదండ్ల ఆర్బీకేలో ఈకేవైసీని పరిశీలిస్తున్న ఏఓ

లింగాల, జనవరి 24: పంట నమోదు అయిన ప్రతి రైతు ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమే ష్ విజ్ఞప్తి చేశారు. బుధ వారం మండలంలోని వెలిదండ్ల రైతు భరోసా కేంద్రంలో రబీ సీజన్‌లో పంట నమోదు అయిన రైతుల ఈకేవైసీ జరుగు తున్న ప్రక్రియను ఏఓ పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సీజన్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతు పంటను ఈ క్రాప్ బుకింగ్ చేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచిం చారు. అలాగే పంట నమోదు అయిన ప్రతి రైతు తప్పకుండా ఈకేవైసీ చేసుకుంటే ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ద్వితీయ వర్ధంతి



కీ॥ శే॥ కొండాపురం గుర్రమ్మ
భర్త కీ॥శే॥ కొండాపురం పెద్దన్న,
శ్రీరాములపేట, ప్రొద్దుటూరు.
మరణం : 25-01-2022

అనురాగం, ఆప్యాయతల ప్రతిరూపం, అందరి హృదయాలలో చిరస్థానం సంపాదించుకొని కుటుంబ బాధ్యతలు పంచుకొని అందరికి అండగా నిలిచిన మీరు మా నుండి 2 సం.రాలు గడిచినను మీ ప్రేమ, మధురస్మృతులు సదా మదిలో చిరస్మరణీయం. దైవసన్నిధిలో మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తూ...

కుమార్తె : కె. ప్రమీలాదేవి, M.A., B.Ed., Teacher

కుమారులు :	కోడళ్ళు :
కె. గురుప్రసాద్, M.A.	డి. గౌరమ్మ, B.A., TTC
కె. రాజశేఖర్	కె. నాగలక్ష్మి
కీ॥శే॥ కె. గురురాజా, B.Tech. –	


మనుమరాళ్లు : కె. కావ్యసుధ, కె. గురుతేజశ్విని
మనుమల్లు : కె. గురుప్రణీత్, కె. గురుకార్తీక్

అన్నదాన కార్యక్రమము : 25-1-2024వ తేది గురువారం ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో అనాథలకు, వృద్ధులకు, యాచకులకు అన్నదాన కార్యక్రమము జరుగును.

మోదీ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు

ఎర్రగుంట్ల, జనవరి 24: మోదీ ఆధ్వర్యంలో పెద్దఎత్తు సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల బీజేపీ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎర్రగుంట్లనగరపంచాయతిలో, రూరల్ పరిధిలో వికసిత భారత్ సంకల్ప యాత్ర కొనసాగింది. అందుకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకర్మ



కీ॥శే॥ తాతిరెడ్డి హృషికేశవరెడ్డి గారు
జననం : 28.07.1944 మరణం : 07-01-2024
కాపువీధి, జమ్మలమడుగు.

కీ॥శే॥ తాతిరెడ్డి హృషికేశవరెడ్డి గారు 7.01.2024వ తేది ఆదివారం నాడు స్వర్గస్తులైనారు.

గమనిక :
25-01-2024 గురువారం జమ్మలమడుగు పట్టణం కాపు వీధిలోని డోర్ నెంబర్ 17/70 మా స్వగృహం నందు పెద్దకర్మ కార్యక్రమం జరుగును.

ఇట్లు
కీ॥శే॥ తాతిరెడ్డి హృషికేశవ రెడ్డి గారి కుటుంబ సభ్యులు

వారంలో సప్లిమెంటరీ ఓటర్ల జాబితా విడుదల : ఆర్డీవో

జమ్మలమడుగు, జనవరి 24: వారం రోజుల్లో ఓటర్ల జాబితాకు సంబంధించిన సప్లిమెంటరీ విడుదల అవుతుందని ప్రస్తుతం 9వ తేదీ వరకు నమోదు అయిన ఓటర్ల జాబితా మాత్రమే బీఎల్‌వోల వద్ద ఉందని జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో పొలిటికల్ పార్టీ నేతల ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై సమస్యలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ 22వ తేదీ విడుదల చేసిన ఓటర్ల జాబితా కేవలం మూడు సెట్లు మాత్రమే అధికారులకు ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ఓటర్ల జాబితా 9వ తేదీ వరకు నమోదు అయిన వాటిని పరిశీలించడానికి అవసరమైన వారు బీఎల్‌వోల దగ్గరకు వెళ్లి జిరాక్స్ తీసుకోవచ్చన్నారు. 9వ తేదీ వరకు మాత్రమే మార్పులు, చేర్పులు, షిఫ్టింగ్ ఉంటాయని, 10వ తేదీ తర్వాత డెత్ ఓటర్లు ఉండవచ్చేమోనని ఇప్పటికి ఎవరైనా 18 సంవత్సరాలు నిండి ఓటు నమోదు చేయించుకోని వారు వెంటనే నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు. సప్లిమెంటరీ జాబితా వచ్చిన తర్వాత చేర్పులు, మార్పులు తదితర వాటికి సంబంధించి ఉండదన్నారు. ఇప్పటికైనా పొలిటికల్ పార్టీ నేతల ప్రతినిధులు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడైనా పొరపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు నారాయణరెడ్డి, నరసింహ, వైసీపీ తరుపున సీతారాముడు, పోచిరెడ్డి, బీజేపీ తరుపున శంకర్‌రెడ్డి, అంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

తొలగించాల్సిన ఓట్లపై సమగ్ర పరిశీలన

ప్రొద్దుటూరు , జనవరి 24 : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో తొలగించాల్సిన ఓట్లపై సమగ్ర పరిశీలన జరుపుతామని ఈ ఆర్ వో చంద్రమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈఆర్‌వో సమీక్ష సమావేశం జరిపారు. సమావేశంలో తహసీల్దార్లు నజీర్ అహ్మద్, ఇందిరా రాణి, డీటీ అజయ్‌బాబు, జహీర్ టీడీపీ ప్రతినిధి షణ్ముక రెడ్డి, జనసేన జిలాన్, బీజేపీ శరత్‌బాబు, కాంగ్రెస్ నజీర్ , సీపీఐ సుబ్బరాయుడు,సీపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం : మాజీ ఎమ్మెల్సీ



మాట్లాడుతున్న దేవగుడి నారాయణరెడ్డి

మైలవరం, జనవరి 24: బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మైలవరంలోని సాయిబాబా దేవాలయ ఆవరణలో జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీసీల సంక్షేమం కోసం, వారి అభివృద్ధికోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేసింది శూన్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కొండయ్య యాదవ్, రాష్ట లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సూర్య పెద్దిరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, టీడీపీ మండల నాయకులు పాపిరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్ : భూపేశ్



సమావేశంలో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జనవరి 24: బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించకుండా సబ్సీడీ పథకాలు ఇవ్వకుండా వారిని అణగదొక్కిన జగన్‌మోహన్ రెడ్డి బీసీల ద్రోహి అంటూ జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఉదయం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయ ఆవరణలో పెద్దముడియం మండలానికి సంబంధించిన జయహో బీసీ క్షేత్రస్థాయిలో బీసీల సమస్యలు గుర్తించి వారి నుంచే నాయకులను వెలికితీసే కార్యక్రమ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తిరుమలకొండయ్య, టీడీపీ నాయకులు రమణారెడ్డి, పొన్నతోట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వంలో బలహీన వర్గాలకు అన్యాయం'



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నేతలు

ఖాజీపేట, జనవరి 24: వైసీపీ ప్రభుత్వం బలహీన వర్గాలకు అన్యాయం చేస్తోందని కడప పార్లమెంటు బీసీసెల్ అధ్యక్షుడు మేకలబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పత్తూరులో బీసీ జయహో సమావేశం టీడీపీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ వికాస్ హరికృష్ణ, టీడీపీ తొగటవీర క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ చక్రధర్, టీడీపీ జంగం సాధికార సమితి కన్వీనర్ కొండపల్లి ఉమాకాంత్, మండల నాయకులు వెంకటసుబ్బయ్య, సారె రామానాయుడు, నాగేష్, కిశోర్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పుల్లయ్యనాయుడు, వెంకటసుబ్బయ్య, బ్రహ్మనాయుడు, రామసుబ్బనాయుడు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విరసం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి

ప్రొద్దుటూరు ,జనవరి 24 : విరసం 29 రాష్ట్ర మహాసభలు జనవరి 27, 28 తేదీలలో విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఏర్పాటుచేసినట్లు విరసం రాష్ట్ర మాజీ కార్యదర్శి వరలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక సృజన సామాజిక వేదిక కార్యాలయంలో విరసం రాష్ట్ర మహాసభల పోస్టర్స్ ఆవిష్కర కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ విరసం రాష్ట్ర 29 రాష్ట్ర మహాసభలు ప్రధానంగా ఫాసిస్టు సందర్భంలో రాజ్యాంగవాదం అనే అంశంకేంద్రంగా ఉపన్యాసాలుంటాయన్నారు. విరసం రచనలు, పుస్తకాలు ఆవిష్కరణ కార్యక్రమం,కవిగాయక సభ వుంటుందన్నారు. 28 సాయంత్రం బహిరంగ సభలో హరగోపాల్, అల్లం రాజయ్య,కళ్యాణరావు, అరసవెల్లికృష్ణ, రివేరా, పాణి పాల్గొంటారన్నారు. పోస్టర్స్ ఆవిష్కరణలో మిత్ర జ్యోతి సాహితీ సంస్థ కార్యదర్శి, కవి ఎస్పీ మహమూద్, ప్రముఖ కథారచయిత దాదాహయాత్ , తెలుగు దస్తగిరి , జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తవ్వాసురేష్‌రెడ్డి, సృజనా సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, విద్యార్థి శక్తి కన్వీనర్ హరిత, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ , బీఎస్‌పీ జిల్లా కార్యదర్శి జయరాం తదితరులు పాల్గొన్నారు.

2 లక్షల చేపపిల్లలు విడుదల

కొండాపురం, జనవరి 24 :గండికోట బ్యాక్‌వాటర్‌లోకి కొండాపురం సమీపంలో బుధవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో సుమారు 2 లక్షల చేపపిల్లలు వదిలారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, మత్స్యశాఖ డీడీ శాంతి,తహసీల్దార్ శోభన్‌బాబు , ఎంపీడీవో కృష్ణప్రసాద్ ,మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ,మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్,మత్స్యశాఖ సహాయకురాలు మల్లీశ్వరి,మాజీ ఉప మండలాధ్యక్షుడు పిల్ల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

31న విజయవాడలో యుద్ధభేరి మహాసభ

మైదుకూరు, జనవరి 24 : ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టసభల్లో ఆమోదించాలంటూ ఈనెల 31న విజయవాడలో యుద్ధభేరి మహాసభను ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షులు తప్పెట శివ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మైదుకూరులో ఏపీ ఎమ్మార్పీయస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం చలో విజయవాడ కరపత్రాలు విడుదలచేశారు. నాయకులు హరిబాబు, వెంకట రమణ, భాస్కర్, వెంకట సుబ్బయ్య, ఓబులేసు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి కాలనీలో మసీదు ప్రారంభం

మైదుకూరు, జనవరి 24 : స్థానిక ఉదయగిరి కాలనీలో నూతనంగా నిర్మించిన మసీదును బుధవారం డిప్యూటీ సీఎం అంజద్ బాషా ప్రారంభించారు. జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ మదీనా దస్తగిరి ఆధ్వర్యంలో నిర్మించిన ఈ మసీదును మత గురువులచే ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

బద్వేలు టౌన్, జనవరి 24 : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గం స్థాయిలో ప్రారంభమైన క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. కాశినాయన మండలం ఆనంవారిపల్లెకు చెందిన ఎన్టీఆర్ ఆర్మీటీం ఫస్ట్ ప్రైజ్‌ను కైవసం చేసుకుంది. రన్నరప్‌గా రాయల్ టీం కైవసం చేసుకుంది. ఈ జట్లకు రితీష్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా లక్ష రూపాయల చెక్కును, ట్రోఫీని అందించారు. రెండోబహుమతి 50వేలు, మూడోబహుమతి రూ.25వేలు అందించారు.

పోరుమామిళ్ల సర్పంచ్‌కు సన్మానం



పోరుమామిళ్ల, జనవరి 24 : సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్‌ను జాతీయ అధ్యక్షుడు వైబీవీ రాజేంద్రప్రసాద్, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబరు ఉపాధ్యక్షుడు మునిరెడ్డి ఆయనను సన్మానించారు. ఈ నెల 23, 24 తేదీల్లో విజయవడలో జాతీయ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. ఈ నెల 30 నుంచి చేపట్టబోయే కార్యక్రమాలను తీర్మానించడం జరిగిందని యనమల సుధాకర్ తెలిపారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram finance ltd Proddatur branch issues the following notice to the general public. My client intend to grant loan to **Smt Gunisetty Lakshmi Devi W/o G.Srinivasulu** residing at Dno:5/1176 Arts College Road Proddatur, Kadapa dist by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regards. **SCHEDULE OF THE PROPERTIES** :- Kadapa district, Proddatur Reg-District,Proddatur Sub district of Proddatur Town & Muncipality Ward No:05 Arts College road Near Little Angeles High School Rameswaram Village Field, SyNo 409-A1/1A Rcc Building An Extent Of Of 1.41 Cents Or 68.24 Sq Yards. **BOUNDARIES:-** EAST : Dno: 5/1161 /2 Little Angels School, WEST : Site of P.Muni Gopal reddy & I.Lakshmi reddy, NORTH : Dno:5/1161/5 P Bala Rangamma, SOUTH: SCNR Arts College Road

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR

సూపరింటెండెంట్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల వారి కార్యాలయము : కడప.

లేఖ నం. 12/జిజిహెచ్/కడప/2023. తేది : 24. 1. 2024

పత్రికా ప్రకటన

సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కడప వారి పరిధిలోని Alcohol and Drug De.Addiction Centre కడపనందు పనిచేయుటకు ఎంపిక కాబడిన Accountant / Data Manager (ఒకరు) అభ్యర్థి వివరములు www.kadapa.ap.gov.in వెబ్‌సైట్ నందు ఉంచడమైనది.

సూపరింటెండెంట్
ప్రభుత్వ సర్వజన వైద్యశాల,కడప.

లోకల్‌కు ఒక న్యాయం.. నాన్ లోకల్‌కు మరో న్యాయమా...?

టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళన



పొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బి.కోడూరు, జనవరి 24 : మండల పరిధిలోని పాయలకుంట్ల గ్రామ పంచాయతీలో లోకల్‌గా ఉన్న రైతులకు ఒక న్యాయం, నాన్ లోకల్‌కు మరో న్యాయమా అంటూ టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. పాయలకుంట్ల గ్రామ పంచాయతీలో కామకుంట, వేమకుంట రెవెన్యూ పొలంలో బద్వేలు, పోరుమామిళ్ల మెయిన్ రోడ్డుకు దాదాపు వందలాది ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. అయితే అదే గ్రామ పంచాయతీకి చెందిన రైతులు ఎప్పుడో పట్టాలు పొంది సాగు చేసుకుంటూ బోర్లు వేసుకుని జీవనం సాగిస్తుంటే వారి పట్టాలన్నీ ఆన్‌లైన్‌లో నుంచి తొలగించి ఏడబ్ల్యుగా మార్చారని అదేవేరే మండలాలకు చెందిన వారికి అధికారులు వత్తాసు పలుకుతూ 196, 195 సర్వేనెంబర్లులో దాదాపు 30 ఎకరాలు (బద్వేలు - పోరుమామళ్ల మెయిన్ రోడ్డుకు) ఒక వ్యక్తికి కట్టబెట్టి ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయించారన్నారు. ఆ పొలం చుట్టూ కంచె వేయించి చెట్లు నాటేందుకు అనుమతులు ఇచ్చారని ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అతను మండల స్థాయి వైసీపీ నాయకులకు లక్షలాది రూపాయలు, అధికారులకు అమ్యామ్యాలు ముట్టజెప్పితే మా ఊరు కాదు, మండలం కాదు అలాంటి వ్యక్తికి ఏ విధంగా పట్టాలు చేస్తారని వారు ఆందోళన చేపట్టారు. అలాగే మున్నెల్లి రెవెన్యూ పొలంలో 2783 సర్వే నెంబరులో దాదాపు 10 ఎకరాలు బాలగురయ్యగారికుంట ఆక్రమించారని అన్నారు. అనంతరం బీకోడూరు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసీల్దారు విద్యాసాగర్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు అధ్యక్షుడు ఓ.రమణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రరెడ్డి, గోడి రమణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మాజీ మండల వైస్‌ఛైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్, సోదరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి24: యువత క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జీవనజ్యోతి విద్యాసంస్థల కరస్పాండెంట్ అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నవసమాజ నిర్మాణం కోసం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్ సర్కిల్ నుంచి గాంధీరోడ్డు, విజయకుమార్ సెంటర్, రాజీవ్ సర్కిల్ మీదుగా శివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జీవనజ్యోతిపాఠశాలల వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు

బి.కోడూరు, జనవరి 24 : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పాయలకుంట్ల గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు గోడి రమణారెడ్డి, దుగ్గిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, బాలయ్య, పవన్, రాఘవరెడ్డి, మద్దిరెడ్డి, బాలిరెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: సైకో ప్రభుత్వానికి రోజు దగ్గరపడ్డాయని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నదండ్లూరులో ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చింతలపులి రాముడు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 50కుటుంబాలు భూపేశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి.ఈకార్యక్రమంలో మండల ఇన్‌చార్జి సి.జయరామి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల బాధ్యుడు ఎం.మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచి నల్లపురెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, పవర్‌కుమార్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, గోపాల్, వెంకటనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో బుధవారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం అట్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. టీడీపీ మినీ మేనిఫెస్టోను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిశీలకుడు శివయ్యస్వామి, రామిరెడ్డి, అట్లూరు మాజీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, యువ నాయకులు అమర్‌నాధరెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, బి.జయక్రిష్టారెడ్డి, రాధాక్రిష్టారెడ్డి, పి.చిలిచి క్రిష్టారెడ్డి, సుబ్బారెడ్డి, చిన్న రామసుబ్బారెడ్డి, టి.గంగిరెడ్డి, నరసింహారెడ్డి, నరసారెడ్డి, రిషికేశవ, సంజీవయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో పథకాలు వివరిస్తూ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న ప్రచారం నిర్వహించారు. బుధవారం పోరుమామిళ్లలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అలాగే రంగసముద్రం పంచాయతీ పరిధిలోని మహబూబ్‌నగర్ కాలనీలో రోశన్న సతీమణి అరుణ రాజీ, టీడీపీ పార్లమెంటు మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి హబీబున్నీసా ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రామసుబ్బారావు, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, ఇమాంహుసేన్, షరీఫ్, సుబ్బారావు, ప్రొఫెసరు బాషా సెట్టెం ప్రతాప్, సంచర్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, అతికారి రాజా, సత్యరాజ్, శ్రీనివాసులు, అన్వర్, గఫార్, గిరి తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన..: టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని బద్వేల్ టీడీపీ నాయకురాలు మాజీ ఎమ్మెల్యే కే.విజయమ్మ పేర్కొన్నారు. బుధవారం బద్వేల్ టీడీపీ ఇంచార్జి బొజ్జా రోశన్నతో కలిసి బాలాయపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అనారోగ్యంతో ఆపరేషన్‌లు చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సర్పంచ్ కందుల రవి, బసిరెడ్డి లక్ష్మీదేవిలను విజయమ్మ పరామర్శించారు. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రాజారెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు రవీంద్రారెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జి విజయ్ కుమార్‌రెడ్డి,డి.క్రిష్టారెడ్డి, ఉల్లి.నాగరాజు, ఓ.రోహిత్‌రెడ్డి,,కే. దుగ్గిరెడ్డి ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కలసపాడు..: కలసపాడు మండలం తెల్లపాడు గ్రామ పంచాయతీలో టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బత్తల భద్రయ్య, బూత్ ఇన్‌ఛార్జ్ బి.రోశిరెడ్డి, నాయకులు చెముడూరి నాగేశ్వరరావు, బొరెడ్డి నారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ బి.వెంకటేశ్వర్‌రెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: ఈ రాష్ట్రంలో అన్ని వర్గాల వారిని జగన్ దగా చేశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. బుధవారం 7 వార్డులోని సంజీవనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి సోదరి హరితారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటిశ్రీను, జిల్లా అధికారప్రతినిధి ఆవుల దస్తగిరి, 8 వార్డు ఇన్‌చార్జ్ మధు, సురసుర శ్రీనివాసులు, కరిముల్లా, పట్నం బాష, గౌస్‌మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల.. పార్టీలో చేరుతున్న వారితో భూపేశ్‌రెడ్డి



అట్లూరు..రెడ్డిపల్లెలో భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహిస్తున్న నేతలు



పోరుమామిళ్లలో భవిష్యత్తు గ్యారెంటీలో బొజ్జ రోశన్న



కలసపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు







కాశినాయన... బాలాయపల్లెలో కరపత్రాలు పంచుతున్న కే.విజయమ్మ, బికోడూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పత్రాలను అందిస్తున్న యువ నాయకులు రితీష్‌రెడ్డి, ప్రొద్దుటూరు 7 వార్డు ప్రచారంలో పాల్గొన్న మౌనికారెడ్డి